

విజేతలుగా నిలిచిన విద్యార్థులు

మూడేళ్లుగా పైసా ఇస్తే ఒట్టు

బోసిపోయిన మహిళా ప్రాంగణం

శిక్షణకు దూరంగా మహిళలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి మహిళా ప్రాంగణం అంటే దశాబ్దకాలం క్రితం వరకూ ఎంతో ప్రత్యేకత. బాధిత మహిళలకు అండగా ఉందన్న పేరుండేది. మద్య, నిరుపేద మహిళలు టైలరింగ్, జర్నలిజం, వ్యవసాయం తదితరాల్లో శిక్షణ ఇచ్చేది. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు సర్టిఫికేట్ పొంది చిన్న చిన్న పరిశ్రమలకు దరఖాస్తు చేసుకుని స్వయం శక్తితో ఎదిగేవారు. ఏడాదికి 500 మంది మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణ పొంది బయటకు వెళ్లేవారు. అలాంటి మహిళా ప్రాంగణం నేడు బోసిపోయింది. మూడేళ్లుగా మహిళా సంక్షేమ శాఖ నుంచి పైసా కూడా కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ఓ ప్రత్యేకాధికారి, ఇద్దరు అటెండర్లు, ఒక వాచ్‌మెన్, ఇద్దరు ఉద్యోగులు రోజువారి రిజిష్టర్‌లో సంతకాలు చేసి మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్‌కు తెచ్చిన కుట్టుమిషన్లు తుప్పుపట్టిపోయాయి. ప్రాంగణం మొత్తం పారిశుధ్యం క్షీణించింది. ఏ గది చూసినా బూజుపట్టి ఉంది. తాము ఏ పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నామని ఒకరిద్దరు సిబ్బంది వాపోవడం గమనార్హం. చాలా మంది మహిళలు తమకు ఫ్యాషన్ డిజైనింగ్ నేర్పించాలని, పాడి పరిశ్రమపై శిక్షణ ఇవ్వాలని, జర్నలిజంలో మెలకువలు నేర్పాలని వంటపై అవగాహన కల్పించాలని దరఖాస్తు చేసుకున్నా నిధుల లేమితో తాము ఏమీ చేయలేక దయనీయ స్థితిలో ఉన్నామని చెప్పి తిప్పి పంపించేస్తున్నారు. నిధులు వస్తే తప్ప ఏమీ చేయలేమని చెబుతుండటం గమనార్హం.

మూడేళ్లుగా పైసా రాలేదు : వాసంతి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్

కరోనా ముందు 90 మంది మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఒక్కో బ్యాచ్‌లో 30 మంది చొప్పున శిక్షణ ఇస్తూ మూడు బ్యాచ్‌లకు 90 మందికి శిక్షణ ఇచ్చాం. 20 మంది మహిళలకు జర్నలిజంపై శిక్షణ ఇవ్వడంతో నవోదయం, వెలుగు పత్రికల్లో రాణిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లు సైతం తమ వద్ద శిక్షణ నేర్చుకుని ఓ మహిళ ఎస్వీబీసీ ఛానల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తోంది. పాడి పరిశ్రమపై వెటర్నరీ యూనివర్సిటీలో శిక్షణ ఇప్పించేవాళ్లం. కరోనా పోయినా ప్రభుత్వం నుంచి 'పైసా' రాలేదు.

భళా... బాలోత్సవం..!

- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు
- సృజనాత్మకతను వెలికితీసేలా పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయతను వెలికి తీయడమే లక్ష్యంగా తిరుపతిలో శనివారం 'బాలోత్సవం' ప్రారంభమయ్యింది. ఐదు వేదికల ద్వారా విద్యార్థులకు పలు రకాలైన పోటీలను శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా తమ టాలెంట్‌ను నిరూపించుకుంటూ పోటాపోటీగా పాల్గొన్నారు. చిన్నారుల అభినయం ఆహూతులను కట్టిపడేసింది. నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన కార్యక్రమానికి తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిథులుగా హాజరై బాలోత్సవాన్ని ప్రారంభించారు. అన్నమయ్య వేదిక ద్వారా జానపద నృత్య ప్రదర్శన, యామిని కృష్ణమూర్తి వేదిక ద్వారా శాస్త్రీయ నృత్య పోటీలు, శంకరంబాడి వేదిక ద్వారా దేశభక్తి గీతాలాపన, పూని నాగేశం వేదిక ద్వారా ఏకపాత్రాభినయం, ప్రధాన వేదికైన చాచా నెహ్రూ వేదికపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రారంభ సభలో ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలియితీసేందుకు, వారిలోని నైపుణ్యానికి పదును పెట్టేందుకు ఇలాంటి బాలోత్సవ కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా తమను తాము అభివృద్ధి చేసుకుంటూ దేశాభివృద్ధికి సహాయ పడాలన్నారు. విలువలతో కూడిన జీవితాలను గడుపుతూ సంఘానికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో బాలోత్సవం కమిటీ నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని, శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని సూచించారు. సమయం చాలా విలువైనదని, దాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. తన చిన్నతనంలో పాఠశాల జీవితాన్ని నెమరువేసుకున్నారు. బాలోత్సవ నిర్వాహకులు నాగార్జున మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, సమాజంలో బాధ్యత గల పౌరులుగా, వారిలో దేశభక్తి పెంపొందించడం, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచేలా ప్రయత్నం చేయడం తిరుపతి బాలోత్సవం ఉద్దేశంగా పనిచేస్తోందని వెల్లడించారు..అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ జిల్లా గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం , అధ్యక్షులు నడ్డా నారాయణ, కార్యదర్శి రెడ్డెప్ప, కోశాధికారి గురునాథం, మునిరామయ్య, సాకం నాగరాజు, మల్లీశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

విద్యుత్ ఉద్యోగిపై ఎస్‌ఇకి ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఉద్యోగాలు, ప్రమోషన్లు ఇప్పిస్తానని మోసం చేసి లక్షలాది రూపాయలు గుంజుకున్న విద్యుత్తు ఉద్యోగి అరవ జయమణిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఎస్పీడీసీఎల్ ఎస్ఇ. ఎం. కష్టారెడ్డికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం బాధితులు పూజా, హరి మరికొందరు విద్యుత్ కార్మిక సంఘం నేతలు కుమార్, ప్రసాద్ ల నేతత్వంలో కష్టారెడ్డిని కలిసి ఫిర్యాదును సమర్పించారు. దామినేడు సెక్షన్ పరిధిలో పనిచేస్తున్న లైన్ మెన్ అరవ జయమణి తనను కార్మిక నాయకుడిగా చెప్పుకుంటూ, విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన తన భర్త హేమంత్ స్థానంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి తన నుంచి 50 వేల రూపాయలు తీసుకున్నాడని, తరువాత పట్టించుకోవడం మానేశాడని, ఫోన్లు చేస్తే బెదిరింపులకు దిగుతున్నాడని, తనకు న్యాయం చేయాలని పూజ పేర్కొన్నారు. మరో బాధితుడు హరి మాట్లాడుతూ తనతో పాటు వినోద్, గుణశేఖర్, రూబెన్ వంటి పలువురు కాంట్రాక్ట్ కార్మికుల నుంచి ప్రమోషన్ ఇప్పిస్తానని, కోర్టు ఖర్చులని 62 వేల రూపాయలు చొప్పున వసూలు చేశాడని, డబ్బులు తీసుకుని పట్టించుకోవడం మానేశాడని ఆరోపించారు. తాము సిఐటియు నాయకుల అండతో కోర్టుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకున్నామని తెలిపారు. డబ్బులు తీసుకున్న అరవ జయమణి తమను మోసం చేశాడని గ్రహించామని తెలిపారు. సిఐటియు నాయకులు ద్వారా తాము అధికారుల దష్టికి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని అరవ జయ మణిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలన చేసి తగు న్యాయం చేస్తామని ఎస్.ఇ. కష్టారెడ్డి బాధితులకు హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని ఉపాధ్యాయుడి మృతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన వడమాల పేట మండలం వేమాపురం వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. రేణిగుంట రైల్వే ఎస్సై రవి కథనం మేరకు.. వడమాల పేట మండలం తిరుమండ్యం గ్రామానికి చెందిన బాలకష్ణ (44) పుత్తూరు మండలంలోని తడుకు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం వడమాలపేటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో పట్టాలను దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరచేతిలో 'వైకుంఠం'

- పరిహారం కోసం రెండేళ్లుగా పడిగాపులు
- అమీతుమీకి సిద్ధమంటున్న పాగాలి రైతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'అవసరమున్నప్పుడు ఓడ మల్లన్న.. తీరాక బోడి మల్లన్న" చందాన వ్యవహరిస్తోందీ ప్రభుత్వం. జగనన్న కాలనీల నిర్మాణం కోసం భూములు లాక్కుని, తీరా వారికి పరిహారమివ్వకుండా అర చేతిలో 'వైకుంఠం' చూపుతోంది. ఫలితంగా పరిహారం కోసం రెండేళ్లుగా పడిగాపులు కాస్తున్న ఏర్పేడు మండలం పాగాలి రైతులు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవు తున్నారు. పరిహారం కాస్త పరిహాసం కాకముందే ప్రభుత్వం స్పందించాలనీ, లేకుంటే తమ భూములు లాక్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

రెండేళ్లుగా 'పడిగాపులు'

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూ లెక్క దాఖలాలో జగనన్న కాలనీ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం గతేడాది 130 ఎకరాలను సేకరించింది. ఫలితంగా పాగాలి, కుమ్మరిగుంట, మేర్లపాక గ్రామాలకు చెందిన 80 మంది రైతులు నిర్వాసితులయ్యారు. నిర్వాసితులైన ప్రతి రైతు కుటుంబానికి ఎకరాకు రూ.15.50 లక్షల నగదు, 3 సెంట్ల స్థలం ఇస్తామంటూ గ్రామ సభలు పెట్టి మరీ ఒప్పందం చేసుకుంది. అయితే ఒప్పందం చేసుకుని రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికి కేవలం 20 మంది రైతులకు మాత్రమే ఎకరాకు రూ.15.50 లక్షల చొప్పున పరిహారం అందింది. తక్కిన రైతులు 'మా డబ్బు మాకివ్వండి బాబో" అంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పడిగాపులు కాస్తున్నారు.

ముందే అప్పుల పాలు

'పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం' అన్న సామెత అచ్చు పాగాలి రైతులకు సరిపోలుతుందేమో పాపం. పరిహారం డబ్బులొస్తాయని ముందే అప్పులు చేసి పీకల్లోతు కష్టాల్లోకి కోరుకుపోయారు కొందరు రైతులు. తమతోటి రైతులకు పరిహారం అందడం..! అదకారులు రేపో మాపో అంటూ ఊరించడమే అందుకు కారణం. మేర్లపాక, కుమ్మరిగుంట, పాగాలి గ్రామాల్లో కొందరు రైతులు అధికారుల మాటలు నమ్మి ఈ రెండేళ్లలో రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు అప్పులు చేసినట్లు వాపోతున్నారు. దీంతో అప్పులోళ్ళు రోజూ ఇబ్బంది పెడుతున్నారనీ, కొందరు ఇళ్ళు కూడా జప్తు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమీ తుమీకి సిద్ధమంటున్న రైతులు

కాళ్ళు, కాళ్ళ చెప్పులు అరిగిపోయేలా తిరిగినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతులు తిరగబడేందుకు సిద్ధమవుతున్నారు. పరిహారం ఇవ్వలేదన్న బాధతో ఇటీవల కొందరు రైతులు జగనన్న లే అవుట్లలో సర్వే రాళ్ళను పీకేశారు. ఇంకొంతమంది మరింత ముందడుగు వేసి సుమారు 15 ఎకరాల్లో మినుము పంటలు సాగు చేస్తుండడం గమనార్హం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులందరకీ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించకుంటే జగనన్న కాలానీని తిరిగి స్వాధీనం చేసుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. రైతులకు అందాల్సిన అంశంపై ఏర్పేడు తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు: మునెయ్య బాధిత రైతు

మా సహచర రైతులకు పరిహారమందించి మాకివ్వకుంటే బాధ కలుగుతోంది. అన్ని అర్హతలు కలిగి, ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పరిహారం ఎందుకివ్వరో అంతుబట్టడం లేదు. అధికారులు ఊరించి ఊరించి మా చేత అప్పులు చేయించారు. అప్పులు చెల్లించలేక పోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సిందే.

'సారస్వత సంవీక్షణం' పుస్తకావిష్కరణ

తిరుపతి సిటి : శ్రీ సాధు సుబ్రమణ్య శాస్త్రి జయంతి సందర్భంగా టిటిడి ముద్రించిన సారస్వత సంవీక్షణం పుస్తకాన్ని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. శనివారం శ్వేత భవనంలో 133వ జయంతి సభ జరిగింది. అంతకుముందు శ్రీమాన్ సాధు సుబ్రమణ్య శాస్త్రి విగ్రహానికి అతిథులందరూ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చరిత్రను ప్రపంచానికి తెలియజేసిన శ్రీమాన్ సాధు సుబ్రమణ్య శాస్త్రి దేశంలోని వందకోట్ల హిందువుల ఆస్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, శ్రీ సాధు సుబ్రమణ్య శాస్త్రి కూతురు గిరిజ, మనవడు కడప అదనపు సెషన్స్ జడ్జి సిఎస్ మూర్తి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

మోడ్రన్ పంచాయతీగా అవిలాల

ఎంపీపీ మోహిత్ రెడ్డికి అపూర్వ స్వాగతం



ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని అవిలాల పంచాయతీలో ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర గొప్పగా సాగింది. శనివారం పంచా యతీలోని ఆలయా లలో ఎంపీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరవేగంగా బహుళ అంతస్థుల నిర్మాణాలతో అభివద్ధి చెందుతూ.. తిరుపతి నగరానికి అతి సమీపంలో ఉన్న అవిలాల పంచాయతీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి మోడ్రన్ గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అంతకుముందు సర్పంచ్ వెంకటరమణ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి గజమాలతో సత్కరించి అపూర్వ స్వాగతం పలికారు. ఎంపీపీ వెంట పార్టీ డివిజన్ అధ్యక్షులు లోకనాద రెడ్డి, ఎంపిడిఓ వెంకటనారాయణ పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులను అప్పటికప్పుడే పరిష్కరించారు. రూ.5 కోట్లకు పైగా చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపిపి వివరించారు.

హిందూ-ముస్లీం ఐక్యతకై... రేపు నాయుడుపేటలో రాష్ట్రస్థాయి సమ్మేళనం

ప్రజాశక్తి - తిరుపతి మంగళం: హిందూ - ముస్లిం ఐక్యత కోసం, దేశంకోసం ప్రాణాలర్పించిన వీరుల స్ఫూర్తిని, త్యాగాలను నేటి తరానికి పరిచయం చేస్తూ, అన్ని రకాల మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే 'జైహె ఉద్యమం' ప్రధాన లక్ష్యమని జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్ నాథ్ ప్రకటించారు. శనివారం తిరుపతిలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ - ముస్లిం ల ఐక్యతే ప్రధాన లక్ష్యంగా ఈ నెల 19వ తారీకున నాయుడుపేటలో వేలాది మందితో ర్యాలీ, సమైక్యతా ప్రదర్శన, రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులు అష్ఫక్‌బిస్మిల్ లను ఉరితీసిన దినం డిసెంబరు 19 తారీకు నుంచి గాంధీజీ అమరత్వం జనవరి 30తారీకు వరకు హిందూ - ముస్లిం సమైక్యతా దినాలుగా పాటిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో సభలు, సమైక్యతా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, జాతీయ కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు రాఘవదాస్ పాల్గొన్నారు.

డివైజెస్ తయారీకి మార్గం సుగమం : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: దేశీయంగా బయో మెడికల్ డివైజెస్ తయారీకి మార్గం సుగమ మైంది. ఈ మేరకు డెబెల్, స్విమ్స్ మధ్య శనివారం కీలక ఒప్పందం జరిగింది. ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి ఈ ఒప్పందం కోసం విశేష కషి చేశారు. తన ప్రయత్నం సఫలీ కృతం కావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గతంలో బెంగళూరు డెబెల్ పరిశో ధనశాలను తిరుపతి ఎంపీ సందర్శించి, స్విమ్స్‌తో ఒప్పందం కుదుర్చు కోడానికి తన వంతు కృషి చేశారు. బెంగళూరు డీఆర్డీఓ నేతత్వంలోని డిఫెన్స్ బయో ఇంజనీరింగ్, ఎలక్ట్రో మెడికల్ లేబొరేటరీ (డెబెల్), తిరుపతి శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) మధ్య పరస్పర విద్య, పరిశోధన రంగాల్లో సహకార విద్యా పరిశోధన భాగస్వామ్యాన్ని అభివద్ధి చేసేందుకు కీలక ఒప్పందాన్ని కుదుర్చు కున్నారు. ఇందుకు బెంగళూరు సీవీ రామన్ నగర్‌లోని డెబెల్ కార్యాలయం వేదికైంది. బయో మెడికల్ డివైజెస్ తయారీకి ఈ ఒప్పందం శ్రీకారం చుట్టనుంది. దీంతో రోగులకు తక్కువ ధరలో ఆరోగ్య సంరక్షణ, సాంకేతికతలను అందిం చేందుకు అవకాశం ఏర్పడింది. రోగులకు ఎన్నో ప్రయోజనాలను కలిగించే ఈ కీలక ఒప్పందంపై డెబెల్, స్విమ్స్ ప్రతినిధులు సంతకాలు చేశారు. డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల అత్యవసర సమయాలలో రోగులకు బాహ్య మద్దతు అందించే పరికరాలు దేశీయంగా అందుబాటులోకి వస్తాయన్నారు. వీటి వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంద న్నారు.

మరో వారం రోజులలో బయో మెడికల్ ఇంప్లాంట్స్ కి సంబంధించిన మరో కీలక ఒప్పందం జరగను న్నదని తెలియజేసారు. కీలక ఒప్పందానికి సహకారం అందించిన పూర్వపు డీఆర్‌డీఓ చైర్మన్, ప్రస్తుత రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి, తితిదే చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, డెబెల్ డైరెక్టర్ డాక్టర్ కొట్రేష్, డెబెల్ సైంటిస్ట్ మోహనవేలు, తితిదే ఈఓ ధర్మారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, ప్రముఖ ఆంకాలజిస్ట్ , స్విమ్స్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జయచంద్రకు ఎంపీ గురుమూర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో డ్వాక్రా చేతి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి శనివారం ప్రారంభించారు. చేతివృత్తిదారులు, డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కోటా దేవకీదేవి తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నుండి సంక్రాంతి పండుగ వరకు నిర్వహణ వుంటుందన్నారు. అతి తక్కువ ధరలకు సామాన్య ప్రజలకు అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని, తిరుపతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవకిదేవి కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు యాదవ్, కో -ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఏపీలో అప్పులు, ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ అబద్దాలు చెప్పారని, తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. మాఫియా గ్యాంగ్‌కి కేంద్ర ఆర్థిక మంత్రి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. తిరుపతి సిపిఐ కార్యాలయంలో నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు మోడీ ఊడిగం చేస్తున్నారన్నారు. సామాన్యులు, రైతులకు రుణాలు మాఫీ చేయకుండా బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు 10 లక్షల కోట్లు రద్దు చేసిందన్నారు. బ్యాంకులకు కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన మాఫియాకు కేంద్ర ఆర్థిక మంత్రి ఊడిగం చేస్తున్నారన్నారు.జి20 లోగోను కమలం గుర్తు ముందు వచ్చేలా రూపొందించడం సిగ్గుచేటన్నారు. నగరి నియోజకవర్గం అయినంబాకం గ్రామంలో అర్ధరాత్రి రెవెన్యూ, పోలీసు అధికారుల సాయంతో రౌడీమూకలు ఖాళీ స్థలాలను శుభ్రం చేసి కాజేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. జగన్ వైఖరితో రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. ఉద్యోగులకు జీతాలు లేవని, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ రోజుకు 35 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విజయ డెయిరీని పునఃప్రారంభించాలన్నారు.ఈ సమావేశంలో జయలక్ష్మి, నదియా, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మురికినీటి 'ముంపు'

- ప్రధాన రహదారి కంపుకంపు
- కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం
- వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రధాన రహదారిపై నిలిచిన మురికినీరు

నిత్యం వాహనాలు, వేలాది మంది పాదచారులు తిరిగే రహదారి. ఈ దారిలో అనేక విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు అనేకం ఉన్నాయి. కానీ డ్రైనేజీ నీరు పొంగి ప్రతి రోజూ రహదారి మొత్తం మురికిమయం అవుతుంది. ఇది ఏ మారుమూల ప్రాంతమో కాదు. నగరానికి వచ్చే ప్రధాన రహదారి. తిరుపతి-రేణిగుంట రోడ్డు మార్గంలో గొల్లవానిగుంట సర్కిల్ వద్ద. రోడ్డుపైనే మురికినీరు నిలిచిపోవడంతో దోమలు, క్రిములు వల్ల స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న వివిధ షాపుల్లో పని చేసే కార్మికులు సైతం అక్కడికి వెళ్లేందుకు దారి సక్రమంగా లేక విధిలేని పరిస్థితుల్లో మురికినీటిలోంచి వెళుతుండడం గమనార్హం. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు రేణిగుంట నుంచి తిరుపతికి ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంది. ఈ మురికి నీటి ద్వారా వచ్చే దుర్వాసనను భరిస్తూ తిరుపతిలోకి ప్రవేశిస్తున్నారు. ఈ మురికి నీటి వల్ల ప్రతి రోజూ ఏదో ఒక ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడం వాహనచారులకు తరచూ గాయాలు పాలవడం జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఇదే మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్అండ్‌బి, తిరుపతి కార్పొరేషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం. వర్షం వస్తే ఈ సమస్య మరింత జఠిలం. అనేక పర్యాలు స్థానికులు స్థానిక కార్పొ రేటర్‌కు, కార్పొరేషన్ అధికారులకు, ఆర్అండ్ బి అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదు. ఇదేమని అడిగితే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నీరు పొంగుతుంది. అది కార్పొరేషన్ అధికారులే చూడాలని, ప్రధాన రహదారి కనుక అది ఆర్ అండ్ బి అధికారులు పరిష్కరించాలని ఒకరికొక్కరు కప్పుతాడు సమాధానాలు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టిటిడిలో ఏం జరుగుతోంది..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజాదృష్టి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏం జరుగుతోంది..? ప్రతిసారీ వివాదాస్పదమైన వ్యాఖ్యలు... పతాక శీర్షికన వార్తలు ప్రచురితమవుతూ శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. మొన్నటికి మొన్న శ్రీవారి ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు ఎవి రమణదీక్షితులు 'తిరుమల అంతా అవినీతిమయం' అని ట్వీట్ చేశారు. వెనువెంటనే శ్రీవారి సన్నిధిలో 54 కులాలు వంశపారపర్య సేవలు అందించాయని, 30/27 యాక్ట్ అమల్లో భాగంగా అందరినీ తిరుమల దించేశారని, వారిలో బ్రాహ్మణులు, కమ్మర, కుమ్మర, చాకలి, గొల్ల తదితర వెనుక బడిన కులాలు ఉన్నాయని ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తిరుమల అవినీతి రాజ్యమేలుతుందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్య పెద్దఎత్తున దుమారం రేపింది. రమణదీక్షితునికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందాయో తెలియదు కానీ రెండు గంటల్లోపే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని డిలీట్ చేయడం గమనార్హం. రెండు గంటల పాటు ట్విట్టర్‌లో ఉండడంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు ఇష్టారాజ్యంగా సంచరించాయి. ఇదిలా ఉండగా టిటిడి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగోన్నతి కేసులో హైకోర్టు చీవాట్లు పెట్టింది. జైలుశిక్షతో పాటు, జరిమానా విధించింది. తీర్పు ఇచ్చిన రెండు గంటల్లోపే 'స్టే' తెచ్చుకోవడం గమనార్హం. దీంతో ప్రతిపక్షాల విమర్శలకు దారితీసింది. అలాగే తెలంగాణాకు చెందిన బోర్డు సభ్యుడు లక్ష్మీ నారాయణ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో రాజీనామా చేసినా టిటిడి ఆమోదించలేదు. అయితే విమర్శలు రావడంతో ఆమోదించాల్సి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన సిని నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌ను ఆ స్థానంలో చకచకా నియమించేశారు. తెలంగాణాకు చెందిన ప్రముఖ నాయకురాలు మంగ్లీని ఎస్వీబీసీ సలహాదారుగా మార్చి నెలలో నియమించినా, వెలుగులోకి వచ్చింది తాజాగానే.. ఏమైనప్పటికీ తిరుమల తిరుపతి దేవస్థానం పతాక శీర్షికన వార్తల్లో ఈ వారం నిలిచింది.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు..
గొల్లపల్లి విద్యార్థులు ఎంపిక

రాష్ట్రస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గొల్లపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి పుత్తూరు టౌన్: మండలంలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.భారతి తెలిపారు. 15వ తేదీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి అండర్-17 బాలికల విభాగంలో పదవ తరగతి చదువుతున్న తిలిక, అండర్-14 బాలికల విభాగంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ధరణి, బాలుర విభాగంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న కిరణ్ కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21, 22, 23 శ్రీకాకుళంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ గోపికృష్ణ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ వినీత, వైసిపి నాయకుడు దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

చెత్తను కలిపి ఇస్తే చర్యలు తీసుకోండి
కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్ నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భవాని నగర్, దేవేంద్ర థియేటర్ రోడ్డు పరిసరాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన కాలువ ఆక్రమణలకు గురై ఇళ్ళు నిర్మించుకున్నారని గ్రహించి ఆక్రమణలకు గురైన ప్రాంతాలను తొలగించాలని ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డీఈ గోమతి, శానిటరి సూపర్‌వైజర్ చెంచయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఏర్పాటు
లాంఛనంగా ప్రారంభించిన ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాహిత్యాభిలాషను పెంపొందించే లక్ష్యంగా 'శ్రీవాణి సాహిత్య ఆధ్యాత్మిక వేదిక'ను శ్రీసిటీలో ఏర్పాటు చేశారు. స్థానిక బిజినెస్ సెంటర్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ చైర్మన్ సంగీత గేయధార సృష్టికర్త డాక్టర్ వి.బి.సాయి కృష్ణ యాచేంద్ర, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీ మాతే డైరెక్టర్ భూషణ్ ఇతర ప్రముఖుల సమక్షంలో ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి లాంఛనంగా దీనిని ప్రారంభించారు. రవీంద్ర సన్నారెడ్డి తండ్రి రాజగోపాల్ రెడ్డి, పలు పరిశ్రమల ప్రతినిధులు, ఏర్పేడు వ్యాసాశ్రమ కళాశాల విద్యార్థులు, శ్రీసిటీ ఉద్యోగులు పాల్గొనగా, వలేటి బాలాజీ కార్యక్రమ అనుసంధానకర్తగా వ్యవహరించారు.

దళిత గిరిజన సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు రూరల్: దళిత గిరిజనులకు ప్రత్యేక హక్కులు రక్షణ చట్టాలు కల్పించి వారి జీవితాలకు రక్షణ కల్పించాలని దళిత గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన జేఏసీ చైర్మన్ టి.గోపాల్ రావు, దళిత గిరిజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పనబాక కృష్ణయ్య ఆదేశాలతో కందుకూరి కళ్యాణమండపం జింఖానా (గ్రౌండ్) విజయవాడలో జరిగే మహాసభకు తరలిరావాలన్నారు. ఈ మహాసభకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని దళిత గిరిజన నాయకులు, ప్రజా సంఘాలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక రాజకీయ ఉద్యమ నేతలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు.

'ఇదేమి ఖర్మ' కార్యక్రమంలో పులివర్తి నాని

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలో 45 రోజులు పాటు నిర్వహించే ఇదేమి ఖర్మ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎల్లమంద పంచాయతీలో చంద్రగిరి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పులివర్తి నాని పాల్గొన్నారు. మండలంలోని ఎల్లమందకు చెందిన టిడిపి నాయకులు అనారోగ్యంగా ఉండటంతో రమేష్, శివలను పరామర్శించారు. అనంతరం ఎల్లమంద, పంచాయతీలో గల ప్రసాద్ నగర్, బోయపల్లి, ఉత్తర గడ్డ, తదితర గ్రామాలలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని తమ్ముడున్నాని భరోసా ఇచ్చారు. టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దాడులు, దౌర్జన్యాలు వైసిపీ నైజం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : దాడులు, దౌర్జన్యాలు చేయడం వైసీపీ నైజమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, డా.జి.చరణ్‌రాజు విమర్శించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని జరగనీయకుండా శుక్రవారం వైసీపీ నాయకులు దాడి చేయడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నాయకులు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ఖూనీ చేస్తున్న పిన్నెల్లి, వైసీపీకి రాజకీయ సమాధి కట్టడం ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు. మిన్నల్ రవి, గాదిపాకం గోపీ, సుబ్బయ్య, కాసరం రమేష్, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డా.జి.కరుణ కుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 11, జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా.జి.కరుణ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్రతినిధులతో, అధికారులతో వర్చువల్ విధానంలో మాట్లాడుతూ న్యాయపరమైన కేసులను పరిష్కరించు కోవడానికి కక్షిదారులకు మంచి అవకాశమని తెలిపారు.

పుత్తూరు టౌన్: పెండింగ్ లో ఉన్న రెవెన్యూ కేసులను పరిష్కరించుకునేందుకు లోకదాలతను సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లీలా శ్యాంసుందర్ పేర్కొన్నారు.

జగనన్న హౌసింగ్ కాలనీలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం కాయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ కాలనీని శనివారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులతో లబ్ధిదారులతో చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఐపిఆర్ఓ ఐ అండ్ పి ఆర్ డిఈ పిటి, ఎంపీడీవోలు, తహశీల్దార్లు. గృహ నిర్మాణ శాఖ వారు, కాయం లబ్ధిదారులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించండి
వైసీపీ మండల ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి

ప్రజాశక్తి -తొట్టంబేడు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని వైసీపీ మండల ఇన్ ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. తొట్టంబేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉన్నం నిర్మల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి బియ్యపు పవిత్రారెడ్డి హాజరై మండలంలో చాలా చోట్ల విద్యుత్ సమస్య ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆ శాఖ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు సక్రమంగా స్పందించడం లేదనే అపవాదును పోగొట్టుకోవాలని ఆమె కోరారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు:ఎంపీడీఓ

ప్రజాశక్తి -బాలాయపల్లి : తుపాను కారణంగా గ్రామల్లో పారిశుధ్యం లోపిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీఓ వినిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కడగుంట గ్రామంలో పారిశుధ్యం పనులు పరిశీలించారు. గ్రామలలో జరుగుతున్న మురుగునీరు తొలగింపు తదితర పారిశుధ్య పనుల్లో పాల్గొని పలు సూచనలు సలహాలు చేశారు.

పడకేసిన పారిశ్రామికం !

6614 ఎకరాల భూ కేటాయింపులతో సరి !
2 లక్షల మందికి ఉపాధి అంటూనే కబుర్లు
75 శాతం స్థానికులకు ఉద్యోగాలు హుళక్కే
ఇదీ జిల్లాలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి

ప్రజాశక్తి- తిరుపతి

జిల్లాలో పారిశ్రామికీకరణ పడకేసింది. 2020వ సంవ్సతరంలోపు 50 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామంటూ ఊదరగొట్టిన టిడిపి ప్రభుత్వం ఉసూరుమనిపించింది. తీరా తాము అధికారంలోకి వస్తే పారిశ్రామీకరణను పరుగెత్తిస్తాంటూ మభ్యపెట్టిన వైసిపి ప్రభుత్వం సైతం వాటి ఊసే ఎత్తడం లేదు.

ఎపిఐఐసి ద్వారా జిల్లాలో ఇప్పటికే 6614 ఎకరాలను ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టింది. అభివృద్ధి పేరుతో పేదలు, రైతుల నుంచి సేకరించిన భూమిని పారిశ్రామికపార్కుల పేరుతో అప్పగించినా, పట్టుమని పాతిక కంపెనీలూ ప్రారంభానికి నోచుకోలేదు. ఎంచక్కా కోట్లాది రూపాయల భూములు, రాయితీలు పొంది, ఎపిఐఐసి షెడ్లలో పాగా వేస్తూ అరచేతిలోనే 'ఉపాధి' చూపుతున్నా నూతన ప్రభుత్వం సైతం పెద్దలు , కార్పొరేట్ కంపెనీల పక్షానే నిలుస్తూ భూ సంతర్పణకు వత్తాసు పలుకుతుండటం గమనార్హం.

రేణిగుంట విమానాశ్రయానికి చేరువలోని ఎపిఐఐసి క్లస్టర్లతో పాటు జిల్లాలో 6614 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కుల అభివద్ధిని చేపట్టింది. 2016- 19 సంవత్సరాలలో భాగస్వామ్య సదస్సులలో మెగా, మేజర్ పరిశ్రమల ద్వారా జిల్లాలో దాదాపు 190 పారిశ్రామిక ఒప్పందాలు జరిగాయి. చిత్తూరు జిల్లాలో 2020 సంవత్సరంలోపు 70 వేల కోట్ల పెట్టుబడులతో గ్రామీణ ప్రాంతాలలో 2లక్షల 10 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రూ.3, 870 కోట్ల పెట్టుబడి తో 75 వేల మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చినట్టు చెబుతూ పరిశ్రమలకు భూ కేటాయిపులు చేసింది. టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 516, 109 ప్రకారం పారిశ్రామికవాడలో రోడ్లు , వీధి దీపాలు, నీటి సరఫరా, షెడ్లు, ఉద్యానవనాలనూ అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వం ఊదరగొట్టింది. ఇప్పటివరకు అభివద్ధిపరిచిన 28 పారిశ్రామిక పార్కులలో 1490 పరిశ్రమలు స్థాపించి 50వేల 74 మందికి ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు ఎపిఐఐసి బుకాయిస్తోంది. అయితే వాస్తవంగా పాతిక కంపెనీలూ ప్రారంభం కాలేదని, వాటిలో కనీసం 1000 మందికి కూడా జిల్లా వాసులకు ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవని అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే, ఎపిఐఐసి చైర్మన్ ఆర్కె రోజా ఆరోపణలు గుప్పించింది. అయితే పదవిలో ఉన్న రోజాగానీ, ఆ తర్వాత చైర్మన్ పదవిలోకి వచ్చిన నేతలు కానీ భూ కేటాయిపులు జరిపిన ఎంఒయులపై సమీక్షించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశ్రామిక రంగాన్ని పరుగులెత్తిస్తామని చెప్పిన వైసిపి నేతలు సైతం ఎపిఐఐసి చేసిన భూ కేటాయింపులు, ఉద్యోగ అవకాశాలపైనా పునరాలోచించకపోవడం గమనార్హం.

నిరుద్యోగుల్లేని నియోజకవర్గమే నా లక్ష్యం

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: నిరుద్యోగుల్లేని శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని చూడటమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు సుమారు 4 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, శ్రీసిటీ, రేణిగుంటకు చెందిన ఐటీ, నాన్ ఐటీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఇంటర్వ్యూలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు శ్రీపవిత్ర రెడ్డి, ఒడురు గిరిధర్ రెడ్డి, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్ యాదవ్,వయ్యాల కృష్ణారెడ్డి, మోహన్ నాయుడు, డిఆర్డిఏ పిడి జ్యోతి, డీఈవో పద్మజ, డిఎస్డివో శ్యామ్ మోహన్, డిఎస్పి విశ్వనాథ్, సీఐ అంజు యాదవ్ పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

జెడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి

సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: ప్రతి ఒక్క పంచాయతీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు వారివారి విధులను సక్రమంగా నిర్వహించాలని జెడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పిటిసి మాట్లాడుతూ కురిసిన వర్షాల వల్ల మురుగునీరు ఎక్కడ నిల్వ ఉండకుండా పంచాయితీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పారిశుధ్యం మీద దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ భానుమూర్తి, ఉడమలపాడు పంచాయితీ సర్పంచ్ దాసరి మనోహర్, మండల విద్యా వనరుల శాఖ అధికారిని భువనేశ్వరి, హౌసింగ్ ఏఈ అలీ, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి ఆయా పంచాయతీ సర్పంచ్లు, కార్యదర్శులు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపీపీ పోలంరెడ్డి. శేఖర్ రెడ్డి, జెడ్పిటిసి నన్నెం ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి వారి శేఖాపరమైన సమాచారాన్ని తెలియజేశారు. జెడ్పిటిసి ప్రిస్కిల్లా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని, అంగన్వాడి సంబంధించి భవనాల మరమ్మతులు ఆగి ఉన్న వాటికి ప్రణాళిక తయారు చేస్తే నిధులు మంజూరు చేస్తామని తెలియజేశారు. ఎంపీడీవో సురేష్ బాబు, ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం మండల్ మీట్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ మండలమీట్‌లో మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలో సమస్యలపై చర్చించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి అలాగే ఇన్‌ఛార్జి ఎంపిడిఒ హరి బాబు తెలిపారు. సిపిఎం ఎంపీటీసీ రాజేశ్వరి మాట్లాడుతూ ఇటీవల కాలంలో బుగ్గ వీధిలోని ఒక ఇంటి మీద పై సెల్‌టవర్‌ను ఏర్పాటు చేశారని దానివల్ల చుట్టుపక్కల వారికి రేడియేషన్ ద్వారా వ్యాధులు వస్తున్నాయని అధికారులకు తెలపగా అప్పుడు వచ్చి అధికారులు టవర్‌ను తొలగించారు. అయితే తిరిగి ఇటీవల కాలంలో సెల్ టవర్ ఏర్పాటు చేశారని వెంటనే అక్కడినుండి ఆ సెల్ టవర్‌ను తొలగించాలని కోరారు. సర్పంచ్ నగేష్ స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకొని అక్కడి నుండి సెల్ టవర్ తొలగిస్తామని తెలిపారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి బాలాజీకాలనీలోని జిల్లా పెన్షనర్లు భవనంలో శనివారం అఖిల భారత పెన్షనర్లు దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జడ్జి వెంగయ్య, డిటిఓ లక్ష్మీకర్ రెడ్డి, ఊక విజయకుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ సత్యానారాయణలు విచ్చేసారు. ఈ సందర్భంగా జడ్జి వెంగయ్య మాట్లాడుతూ పెన్షనర్లు చేసిన సేవలను గుర్తుచేసి కొనియాడారు. తిరుపతి పెన్షనర్ల గౌ.అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులు కె.ఆర్.శంకర్, కార్యదర్శి వెంకటేశం శెట్టి, సురేష్ బాబు, వెంకటరమణ, గోపాల్, పాపయ్య, జయలక్ష్మి, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్పర్సన్ మక్కిన భాస్కర్ , లయన్స్ క్లబ్ కార్యదర్శి వి. జంగన్నాథం, ఎన్. శివారెడ్డి, దామోదరం, రఘు పాల్గొన్నారు.

పాకాల: విశ్రాంత రైల్వే ఉద్యోగులు 38వ పెన్షనర్స్ డేను పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామయ్య అధ్యక్షతన శనివారం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఎం.కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విశ్రాంత ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం హరిప్రియ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి బిపి షుగర్ దంత పరీక్షలు నిర్వహించారు. ఖాదర్ బాషా, విశ్వనాథం రెడ్డి, ఆరోగ్య నాదం, రాజగోపాల్ మోదిలి, శశి, కుమార్, ఆలీ మణి, సంతానం, రంగయ్య పట్టాభిరెడ్డి, రామచంద్రానాయుడు, వెంకటరత్నం, రామ్మూర్తి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పినాకిని నగర్ (డీఆర్‌డీఎల్ కాలని)మల్టీ పర్పస్ హాల్లో పెన్షనర్స్ డే సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ రావు షార్ అసోసియేట్ డైరెక్టరు (ఆక్టింగ్ డైరెక్టరు)డా.ఆర్ వెంకట్ రామన్ సభకు ఆహ్వానించారు. డీఆర్ ఈయూ నాయకులు శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య డా.వెంకట్రామన్ షాలువాతో సత్కరించారు. అసోసియేషనుకు తమ సాయంగా రూ.7500 చెక్కు అందజేసారు. నెల్లూరు నుండి షార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు హుస్సేన్ హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి కుమార్ స్వామి, కోశాధికారి రామణరావు తమ నివేదికలను సమర్పించారు.

నేడు రజక వృత్తిదారుల జిల్లా సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి:

రజక వత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జోరేపల్లి దిలీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞానకేంద్రం (ఎంబిభవన్)లో నిర్వహించే సదస్సుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, జిల్లా గౌరవఅధ్యక్షులు కందారపు మురళి, సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది కుమారమంగలం నేతాజీ హాజరుకానున్నారు. ఈ సదస్సులో తిరుమల కళ్యాణకట్ట తరహాలో ధోబీఘాట్‌లను టీటీడీ ఏర్పాటు చేసి, రజకులకు ఉద్యోగాలు ఇవ్వాలని, స్విమ్స్, రుయా, బర్డ్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ధోబీ పోస్టులను భర్తీ చేయాలని, వత్తిదారులకు రుణాలను మంజూరు చేయాలని, మరో 10 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి
నాయకులు కర్లపూడి పోలయ్య పిలుపు

ప్రజాశక్తి -కోట: గూడూరు నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతనానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ నాయకులు, ట్రెజరర్ కర్లపూడి పోలయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం కర్లపూడి పోలయ్య మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గంలో బీఎస్పీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. డివిజన్ స్థాయిలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పకుండా సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి- కేవిబిపురం: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ ఏర్పాటు చేసినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో సహజ వనరులను వినియోగం, వాటి ప్రాము ఖ్యత భావి వనరుల ప్రాముఖ్యత గురించి వివరించారు.

సాగుభూమికి పట్టాలివ్వండి
తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామ రెవెన్యూ వి.ఎస్.పురం దళితులు సుమారు 50 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ బిఎన్‌కండ్రిగ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సాగులో ఉన్న రైతులకు రెవెన్యూ అధికారుల సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి కృష్ణయ్య, దాసు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్(శ్రీరామ్ నగర్ కాలనీ) ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల యువత ఎలా ప్రాణాలు కోల్పోతున్నారో ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ బాషా ప్రజలకు వివరించారు. ఏజీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిదీన్ భాష మాట్లాడుతూ కళాశాలకు ఎన్ఏఏసి గుర్తింపు రావాలంటే పూర్వ విద్యార్థుల సంఘం కీలకపాత్ర ముఖ్యమని అన్నారు. పూర్వ విద్యార్థుల విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ రమణమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్ 14, 17 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

ప్రజాశక్తి - రేణిగుంట : 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ చిత్తూరు ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం నుండి నుంచి అండర్ 14, 17 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు రేణిగుంట పట్టణంలోని జెడ్పీ పిపి బాలికోన్నత పాఠశాలలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శులు బాబు, సురేష్, రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణు వర్ధనం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: అంగన్వాడి కేంద్రాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని చెన్నావారిపాలెం అంగన్వాడీ కార్యకర్త శాంతి కోరారు. శనివారం స్థానికంగా కొంతమంది యువకులు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చిన గుడ్లు కుళ్లిపోయాయంటూ ఆ గుడ్లు తిన్న చిన్నారులు అస్వస్థతకు గురి అయినట్లు సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేశారు. ఈ విషయాన్ని ఖండిస్తున్నామని ఆమె తెలిపారు.

పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి- కెవిబిపురం: మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన పి.సరస, మునెమ్మకి చెందిన పూరిల్లు గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైంది. బాధితులను ఆదుకోవాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ బాధితులు మునెమ్మ, నరస, బాలకృష్ణతో కలిసి ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పూర్తిగా వంట పాత్రలు, బట్టలు, ఆహార ధాన్యాలు, నగదు, బంగారం, కాలిపోవడం వలన కట్టుబట్టలతో వీధిన పడ్డారని, అలాంటి పేదవారిని ప్రభుత్వం ఆదుకోవాలని జగనన్న పక్కా ఇల్లు మంజూరు చేసి, గ్యాస్ కంపెనీ నుంచి ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా మంజూరు చేయించాలన్నారు. అదే విధంగా అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇంటి స్థలానికి రికార్డులను కూడా నకలు కాపీలు మంజూరు చేయాలని, ఆర్థికంగా, కూడా ప్రభుత్వం సాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు జరగకుండా చూడాలి
ఆర్డీఓ కనక నరసారెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎమ్మెల్సీ ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణలో తప్పులు జరగకుండా చూడాలని తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి కనక నరసారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం తిరుపతి, అర్బన్, రూరల్, చంద్రగిరి, పాకాల మండల తహశీల్దార్ల కార్యాలయాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఓటరు జాబితా స్క్రుటీనీని ఉపకమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డితో కలసి పరిశీలించారు. ఆర్డీఓ వెంట తిరుపతి అర్బన్ రూరల్, చంద్రగిరి, పాకాల తహశీల్దార్లు వెంకటరమణ, లోకేశ్వరి, శిరీష, భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ, రమేష్ బాబు, గృహ నిర్మాణ శాఖ, ఏఈ, ఎంఈవో, తదితరులు ఉన్నారు.

నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హోటళ్ల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తిరుపతి, శ్రీకాళహస్తి ఫుడ్ అండ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టరు జగదీష్ రాజు హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని తేరువీధి, బజారువీధి, సన్నిధివీధి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పలు హోటళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండానే పలు హోటళ్ళు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. తాము పరిశీలించిన అన్ని హోటళ్లకు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలన్నారు. పది రోజుల తరువాత మళ్లీ ఆకస్మిక దాడులు చేస్తామనీ, అపుడు కూడా పరిస్థితి ఇలాగే ఉంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వినియోగదారులను మోసం చేసినా, ఇబ్బందులకు గురి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆకస్మిక తనిఖీలకు సహకరించిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఏపీ డిప్యూటీ ఛైర్మన్ యలంపాటి. కోటేశ్వరబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

భవిష్యత్ సాంకేతిక విద్యదే : సుధాకర్ రెడ్డి
ఎస్వీసీఈలో ఘనంగా 2022 ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాబోవు రోజులు ఇంజినీరింగ్ నిపుణుల ఆవశ్యకతను పెంచుతుందని, భవిష్యత్తు సాంకేతిక విద్యతోనే సాధ్యమవుతుందని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తిరుపతి-కరకంబాడీ మార్గంలోని ఎస్వీసీఈలో 2022 ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో తమ కళాశాలలో అడుగు పెట్టిన విద్యార్థులకు వారి లక్ష్యాలను చేరుకోవడానికి యాజమాన్యం తగిన కార్యచరణతో ముందుకెళ్తుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ఛైర్మన్ ఏ.గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, కార్యదర్శి ప్రదీప్ అంబవరం, డాక్టర్ కె.శేఖర్, డాక్టర్ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయంలో వర్క్ షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సెక్సువల్ హరాస్మెంట్ అండ్ వైలెన్స్ అగైనెస్ట్ విమెన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రొటెక్షన్ ఆఫ్ విమెన్ ఫ్రం సెక్సువల్ హరాస్మెంట్ ఎట్ వర్క్ ప్లేస్ యాక్ట్ 2013 పైన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, లైంగిక వేధింపులు, మహిళల హోదాకి, గౌరవానికి సంక్షేమానికి, భంగం కలిగించడంతో పాటు మానసిక శారీరక క్షోభకి గురి చేస్తాయని అభిప్రాయపడ్డారు. అందుకే ఉద్యోగినులుగా మారబోయే ఈనాటి విద్యార్థులకు ఈ చట్టంపై అవగాహన కల్పించే నిమిత్తమై ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. కమిటీ మెంబర్, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రజితతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - రేణిగుంట : మండలంలోని గుత్తివారిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం జెడ్పీ హైస్కూల్‌లో చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్థిక సాయంతో రాష్ట్రీయ సేవా సమితి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రాష్ట్రీయ సేవా సమితి సమన్వయకర్త శైలజ ప్రాజెక్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, డాక్టర్లు, సుమారుగా 350 మంది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత
వీసీ ఆచార్య జమున

ప్రజాశక్తి - క్యాంపస్ : పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని వీసీ ఆచార్య జమున పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ బయో సైన్స్ అండ్ సెరికల్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుజాత ఆధ్వర్యంలో కృత్రిమ అడవి నిర్మాణం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏజీఎస్ హెల్త్ సంస్థవారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 1000 మొక్కలను దట్టమైన అడవి నిర్మాణానికి ఇచ్చారు. మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.జమున విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని, మహిళా యూనివర్సిటీ కార్బన్ న్యూట్రాల్టీ క్యాంపస్ అవ్వాలని, అది అందరి బాధ్యత అని తెలిపారు.

నేదురుమల్లి హరీష్ చంద్రారెడ్డికి రుణపడి ఉంటాం
పెన్నక్కచెరువు ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి -కోట: మాండూస్ తుపాను కారణంగా గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు నారుమళ్ళు, వారినాట్లు వేసిన పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు. స్థానిక వైసీపీ నాయకులు నేదురుమల్లి హరీష్ చంద్రా రెడ్డి ఈ సమస్యను వెంటనే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఇరిగేషన్ అధికారులు డీఈ ఫరూక్, అబ్దుల్లా తదితర సిబ్బందితో కలిసి పంట పొలాల్లో నుండి నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించడంతో రైతులందరూ కలిసి నేదురుమల్లి హరిచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహారాజ రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, శ్రీకాళహస్తి
ఐ.ఏ. నెం. 408/2019
ఏ.ఎస్. నెం. / 2019

Between:
శ్రీ కదుంబూరు కుప్పయ్య మరియు ఇతరులు ... వాదులు/అప్పీల్లంట్స్
And:
శ్రీమతి పులిపాడు మేరి మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
టు
1. శ్రీ ఆరోగ్య రాజన్ చంద్రన్ తండ్రి లేట్ కె. రామచంద్రన్ నాయుడు, ఇంటి నెంబర్: 20-1471/13/సి, మారుతి నగర్, తిరుపతి టౌన్, తిరుపతి జిల్లా ... 3వ ప్రతివాది
2. శ్రీ మధుకుమార్ తండ్రి రామచంద్రన్, ఇంటి నెంబర్: 20-1471/13/సి, మారుతి నగర్, తిరుపతి టౌన్, తిరుపతి జిల్లా ... 4వ ప్రతివాది, ప్రతివాదులు

ప్రకటన

పై కనిన అప్పేల్లంట్స్ మహా రాజ రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, శ్రీకాళహస్తి వారి కోర్టులో ఓ.ఎస్. నెం. 248/2009 జడ్జిమెంట్‌కు వ్యతిరేకముగా అప్పీల్ చేస్తూ సదరు కోర్టు యందు దాఖలు చేసియున్నారు మరియు అందులో ఐ.ఏ.నెం. 408/2019 పిటిషన్ ద్వారా అప్పీల్‌కు ఆలస్యమును మన్నించుచూ సదరు ఐ.ఏ. నోటీసులు పై రెస్పాండెంట్స్ 3 మరియు 4 వారికి కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా చేరనందున, పై తెలిపిన రెస్పాండెంట్స్ 04.01.2023 తేదీన పై తెలిపిన కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ లేక వకీల్ ద్వారా కానీ ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్. గౌస్ బాషా, బి.ఏ., బి.ఎల్.,
వాది తరపున న్యాయవాది, శ్రీకాళహస్తి
సెల్: 9701058365.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : SRIKALAHASTI
O.S.NO. 53/2017

B. Jayachandra ... Plaintiff
Vs
B. Nagaiah (Died) and others ... Defendants

SUMMONS TO THE DEFENDANTS NO. 7 & 13

R7: M. Sakunthala W/o. M. Mangaiah SBR Puram (V&P), Vadamalapet (M), Tirupati District.
R13: B. Aswini D/o. Late B. Subramanyam, Vedarla Cheruvu (V&P), Renigunta (M), Tirupati District.

పై కనిన దావాలో కోర్టు వారు ప్రతివాది నెం.7 మరియు 13 హాజరు నిమిత్తం వాయిదాను 23.12.2022 తేదీకి వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ 23.12.2022 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కనిన కోర్టు నందు హాజరు అయి మీ ఆక్షేపణను కోర్టు యందు తెలుపుకోవలెను. అటు హాజరు కాని యెడల పై దావాను మీ పరోక్షములో సదరు కోర్టు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

N. PADMANABHAM
M. NAGARJUNA REDDY,
Advocates Plaintiff
Tirupati.
Cell: 9030787739.

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, శ్రీకాళహస్తి
ఓ.యస్. నెం. 12/2022

పి. సుబ్రమణ్యం వగైరాలు ... వాదులు
ఆర్. రాజేశ్వరి ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

టు
రామిశెట్టి రాజేశ్వరి భర్త లేట్ చంద్రశేఖర్
డోర్.నెం. 3-315, కొండమిట్టవీధి, శ్రీకాళహస్తి టౌన్.

పై కనిన వాదులు తమకు రావలసిన రిజిష్టరు అడుమాన అప్పు బాకీ వసూలు నిమిత్తమై సదరు దావా మీపై సదరు కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు దావాను 28.12.2022వ తేదీన వాయిదా వేసియున్నారు. పై విషయాన్ని కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున పై తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు గానీ మీ తరపు వకీలు గానీ హాజరై అభ్యంతరములు తెలుపుకోవచ్చును. లేని యెడల కేసును పరోక్షమున విచారించి తీర్మానించబడును.

పి. భాస్కర్
పి. అయ్యప్ప
న్యాయవాదులు, శ్రీకాళహస్తి.

IN THE COURT OF DISTRICT MUNSIF CUM JUDICIAL MAGISTRATE AT UTHUKOTTAI
O.S.NO. 38 OF 2021

Mrs. Radhabai ... Plaintiff
Vs
1. Mr. Narayana Reddy and 7 others ... Defendants

To:
D6. Mr. Prasath Reddy, S/o Munibooshanam, residing at No.8/228, Purathuttur Village and Mandalam, Kadappa District, Andhara Pradesh, Pin code-5163060.

PUBLIC NOTICE

This is to inform you that the above plaintiff is filed suit for declare the release deeds as null and void and permanent injunction against you. In this regard, the Hon'ble District Munsif cum judicial magistrate at Uthukottai was pleased to order public notice to you in O.S.No.38/2021 returnable by 04.01.2023.

Hence, you are requested to appear cither in person or through your counsel on 04.01.2023 at 10.30 AM, before the Hon'ble District Munsif Cum judicial Magistrate court at Uthukottai to put forth your objections if any on that day, failing which the matter will be decided in your absence.

R. Ramesh, B.A., B.L.,
Counsel for Plaintiff
Cell: 9751166982.

Before The IV Addl. Motor Accident Claims Tribunal: Nellore
M.V.O.P.No.537 / 2021

S. Sunil - Claimant
Vs
1. M. Lakshmaiah and 2 others - Respondents

Notice

To,
R1. M. Lakshmaiah, S/o M. Ravindra, Driver of TATA Indica Car bearing No. AP-31-CG-9555, resident of D.No. 1-1817, Velampalem Village, Srikalahasthi Mandal, Chittoor District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పైన తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు నిమిత్తం తే05-01-2023ది కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

టి.వి. కళ్యాణ్ కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.